
# పోతనభాగవతంలో రసగుళికలు



– ఆర్.శర్మ దంతుర్తి

## 115 వ భాగం

## పురంజనోపాఖ్యానం; పృధు చరిత్ర -8

మహావిష్ణువు చెప్పినట్టూ సనక సనందనాదులు నలుగురూ పృథు చక్రవర్తి దగ్గిరకి వచ్చారు. అన్నీ తెల్సినా, ఎంతటి వైరాగ్యం ఉన్నా, ఇతరులకి ఎంతటి సేవ చేసినా బ్రహ్మజ్ఞానం మాత్రం రాదు, సాధన చేయకపోతే. చివరకి బ్రహ్మదేవుడు కూడా పుట్టినప్పుడు ఏమీ తెలియక, తపః తపః అనే చప్పుడు వినిపించి తపస్సు చేసాక తానేమిటి, భగవంతుడెవరూ అనే విషయాలు తెలిసాక సృష్టి ప్రారంభించాడు కదా? ఆ విషయం ఇప్పుడు వాళ్ళు చెప్తున్నారు పృథువుతో.

వ. కావున శ్రద్ధయు, భగవద్ధర్మచర్యయుఁ, దద్విశేష జిజ్ఞాసయు, నాధ్యాత్మిక యోగ నిష్ఠయు, యోగీశ్వరోపాస్తియుఁ, బుణ్యోపాశ్రయుండును బుణ్యశ్రవణుండును నైన నారాయణ కథాలాపంబులు, నర్థేంద్రియారాములైన వారలతోడి సంగతి యందు విరక్తియు, వారల కభిమతంబు లైన యర్థ కామంబు లందు ననాకాంక్షయు, సర్వేశ్వరుని గుణ కీర్తనామృతపానంబు దక్క నితర పదార్థంబులందు వైరాగ్యంబు నొంది యాత్మారామత గలిగి విజన స్థలంబు లందు రుచిగలుగుటయును, నహింసయు, శమాదిప్రధానవృత్తియు, నాత్మహితానుసంధానంబును, భగవత్కథానుస్మరణంబును, నకామ్యంబు లయిన యమనియమంబులును, నితరభక్తిమార్గాగర్హణంబును, యోగక్షేమార్థ క్రియారాహిత్యంబును, శీతోష్ణాది ద్వంద్వ సహిష్ణుతయు, భాగవత కర్ణాలంకార భూతం బగు భగవద్గుణాభిధానంబులు నను వీనిచేత విజృంభమాణంబైన భక్తియోగంబునం జేసి యనాత్మ యందు నసంగంబును, గార్యకారణ రూపంబగు నిర్గుణ బ్రహ్మంబు నందు రతియును నెప్పుడు గలుగు నప్పుడ సదాచార్యానుగ్రహవంతుం డయిన పురుషుండు బ్రహ్మనిష్ఠులతోడఁ జెలిమి చేయుచు నీషణత్రయంబు వర్జించి ప్రకృతిం జేరక జ్ఞాన వైరాగ్య వేగంబునం జేసి.

[4-618]

భగవత్కథలు వింటూ, యమనియమాదులు అభ్యసించి, నిరంతరం భక్తి మార్గం అవలంబించాలి. అలా భక్తి పెంపొందితే దాన్ని పోగొట్టుకోకుండా నిర్గుణ బ్రహ్మంలో కోరిక ఉంచుకుంటూ సదాచారం పాటించాలి. ఈషణ త్రయం (దారేషణం, ధనేషణం, పుత్రేషణం) వదులుకుంటూ జ్ఞాన వైరాగ్యాలు అలవరుచుకోవాలి. ఈ వచనంలో చెప్తున్నారు చూడండి – శీతోష్ణాది ద్వంద్వాలు విడనాడాలి. కోరికలు వదుల్చుకోవడం కోసం యమనియమాదులు పాటించాలి. ఇవి పతంజలి మహర్షి చెప్పిన విషయాలు – యమం అంటే నియంత్రణ, నిగ్రహించుకోవడం (సత్యం, అహింస, బ్రహ్మచర్యం, అస్తేయం – అసూయ లేకపోవడం, అపరిగ్రహం – తనవి కానివాటిపై, అవసరం లేనివాటిని తీసుకోకపోవడం), నియమం (రోజూ చేసే కార్యక్రమాలు – శౌచం, సంతోషం, స్వాధ్యాయం, తపస్సు, ఈశ్వర ప్రణిధానం – అంతా జరిగేది పరమేశ్వర సంకల్పమే అనే ఆలోచన), ఆసనం, ప్రాణాయామం; ఇవి జరిగాక కలిగేది ప్రత్యాహారం – విషయవాంఛల మీదనుంచి మనస్సు మరల్చి లోపల ఆత్మపై ఉంచడం. దీనివల్ల కలిగేది – ధారణ. దానితో ధ్యానం. ఇంతవరకూ వచ్చాక చివరకి సమాధి. ఈ సమాధి పొందిన వ్యక్తికి ఇంక మరో జన్మ అనే ప్రసక్తి లేదు.

సీ. అనఘ! సాక్షాత్కార మగు భక్తి యోగాగ్ని
గడఁగి జీవాధారకమును బంధ
భూతాత్మకంబునై పొలుచు హృద్గ్రంథిని–
బూని స్వకారణభూత మయిన
యరణి దహించు హుతాశను కైవడి–
నిర్దహించిన నిట్లు నెఱిసి దగ్ధ
చిత్తుఁడై ముక్తనిశ్శేషాత్మ గుణుఁడు స–
ద్ధర్ముఁడు నైన యతండు మిగుల [4-619]

తే. నర్థి బాహ్యంబు లయిన ఘటాదికములు
నాంతరము లైన సౌఖ్యదుఃఖాదికములు
నను విభేదము లాత్మ భేదనము లగుట
నయ్యుపాధి వినాశంబు నందగలఁడు [4-619.1]

ఇలా భక్తి యోగాగ్నిలో ఉన్న జీవుడు బంధాలకి కారణమైన హృద్గ్రంథిని (హృదయంలో ఉండే అజ్ఞానం అనే ముడి, లేదా అహంకారం) ఛేదించగలడు – ఎలాగంటే ఆరణిని దహించే అగ్నిలాగా. ఒకసారి ఆ దహనం కలగగానే ఉపాధికి కారణాలైన (అంటే కోరికల నుండీ, వాటివల్ల కలిగే అంతులేని జన్మ పరంపరలనుండీ) వాటినుండి విముక్తి పొందుతాడు. ఈ పద్యంలో అగ్ని అనే పదం ఎక్కడుంది? హుతాశనుడు – హుతములను భుజించువాడు, అగ్ని.

చ. పురుషుఁడు నిద్రపోఁ గలలఁ బొందిన యాత్మసుఖైక హేతువై
పరఁగిన రాజభృత్యజన భావగుణంబులు సంప్రబోధమం
దరయఁగ మిథ్య యైనగతి నాంతర బాహ్యగుణప్రభేదముల్
పరువడిఁ గానకుండు జనపాలనశీలన! నిత్యఖేలనా! [4-621]

మనిషి నిద్రలో తాను రాజు అయినట్టూ, సంపదలతో ఉన్నట్టూ కలగంటాడు. కల కరిగిపోతే ఏమీ లేదు. అలాగే జీవితంలో (పై పద్యంలో చెప్పినట్టూ) ఉపాధులు నశించగానే బాహ్యంగా జరిగే గుణభేధాలు ఏమీ అంటుకోవు. ఇందులో రాజుని జనపాలనశీలనా అంటున్నారు. ప్రజాపాలనో నేర్పరి కనక నీ మనసుని కూడా జయించగలవు సులభంగా అని చెప్పడానికన్నమాట.

వ. అదియునుం గాక "యాత్మనస్తుకామాయ సర్వం ప్రియం భవతి" యను వేదవచనంబునం జేసి విషయంబులకుం బ్రియతమత్వంబై యాత్మోపాధికంబు నొందిఁ యాత్మాపహ్నవంబునం బాటిల్లు స్వార్థనాశం బెద్ధి గలుగు దాని కంటె లోకంబున నధికంబైన స్వార్థనాశంబు లే; దది యెట్లనిన సర్వార్థ నాశంబునకు స్థైర్యంబు నొందించునట్టి యర్థకామాభిధ్యానంబునం దద్ధేతుకంబైన స్వార్థనాశంబునం బరోక్షాపరోక్షరూపజ్ఞానంబు నశించుం గావున నాత్మాపహ్నవంబున కంటె నధికతరంబైన సర్వార్థనాశంబు లే" దని వెండియు నిట్లనియె. [4-624]

అంతేకాదు. ఆత్మని ప్రేమించినవాడికి ప్రపంచంలో అన్నీ ప్రియంగానే కనబడతాయి. ఇదే సర్వం విష్ణుమయం జగత్ అంటే. ఈ ప్రపంచంలో ఏవుంది? ఆత్మ తప్ప ఇంకేమీ లేదు. శివానందులు చెప్పారు కదా, ఏది తెలుసుకుంటే ఇంకేమీ తెలుసుకోనక్కర్లేదో అదే బ్రహ్మ జ్ఞానం. అయితే అర్ధకామాలని అభిలాషిస్తే మిగిలేదేమిటి? సర్వ నాశనం. అందువల్ల పరోక్షంగా ఆత్మజ్ఞానం మరుగుపడడం కంటే సర్వనాశనమైన విషయం మరోటి లేదు.

వ. మోక్షంబె పరమపురుషార్థం” బని చెప్పి వెండియు నిట్లనియె “నరేంద్రా! దేహేంద్రియ ప్రాణ బుద్ధ్యహంకార పరివృతంబు లయిన యీ స్థావర జంగమంబుల హృదయంబులందు వ్యాపకుండుఁ బ్రత్యక్షభూతుండుఁ బ్రత్యగ్రూపుండు భగవంతుండు నయిన యీశ్వరుం డంతర్యామి రూపంబునం బ్రకాశించుచుం; డది నారాయణుని సద్రూపంబుగాఁ దెలియు” మని వెండియు నిట్లనియె. [4-626]

అందువల్ల మోక్షం ఒకటే పురుషార్థం. బుద్ధి, అహంకారం పైన కప్పుకుని ఉన్నా లోపల ప్రతీ స్థావర జంగమాత్మకాలలో ఉండే వ్యాపకుడైన, భగవంతుణ్ణి నారాయణుడిగా తెలుసుకోవాలి.

చ. సుమహిత నిత్య ముక్త పరిశుద్ధ విబుద్ధ సుతత్త్వుఁడై యురు
క్రముఁ డభిభూత సత్ప్రకృతి కర్మకళంకుఁడు నైన యట్టి యు
త్తమచరితుం గృపాకరు నుదాత్తగుణోన్నతు నీశ్వరేశుఁ జి
త్తమునఁ దలంపుమయ్య! జనతాపరిరక్షణ! దుష్టశిక్షణా! [4-628]

అలా లోపల – నిత్య పరిశుద్ధుడు, విబుద్ధుడు; మంచి తెలివితేటలు కలవాడు, ఉరుక్రముడు; గొప్ప క్రమం కలవాడు, మహావిష్ణువు, కర్మకళంకుడు, కృపాకరుడు – అయిన భగవంతుణ్ణి మనసులో ధ్యానం చేయి.

మ. అరిషడ్వర్గమహోర్మి నక్రనికరవ్యాకీర్ణ సంసారసా
గర మబ్జోదరకీర్తనాతరణి సాంగత్యంబునం బాసి తా
మరుదారంగ నఘాపహప్రకట యోగాదిక్రియాయుక్తి చేఁ
దరియింపన్ మదిఁ గోరువారలకు దుర్దాంతంబగుం గావునన్. [4-630]

ఎందుకలా ధ్యానం చేయాలంటే, అరిషడ్వర్గాలతో కూడిన (కామ, క్రోధ, లోభ, మద, మోహ, మాత్సర్యాలు) ఈ సంసారం అనే సముద్రం దాటాలంటే భగవన్నామం (అబ్జోదర – ఉదరంలో పద్మం ఉన్నటువంటి విష్ణువు, కీర్తనాతరణి) అనే నావ లేకపోతే అసాధ్యం.

క. అని యీ గతిఁ బంకరుహా
సనసుతుఁడును బ్రహ్మబోధశాలియు నగు నా
ఘన యోగివల్లభునిచే
తను దెలియఁగఁ బడిన బ్రహ్మతత్త్వం డగుచున్. [4-632]

అలా సనత్కుమారుడు (పంకేరుహాసనసుతుడు – పద్మంలో కూర్చుని ఉన్న వాడి కుమారుడు – బ్రహ్మదేవుడి మానస పుత్రుడు కదా), బ్రహ్మజ్ఞానం ఇవ్వడంలో గొప్పవాడైన యోగివల్లభుడు – చెప్పాడు రాజుతో. అంటే గురువుగా దీక్ష ఇచ్చాడు పృథువుకి. అలా బ్రహ్మజ్ఞానం ఎలా సంపాదించాలో చూపించారు గురువులు.

క. జనపతి మునిఁ బొగడి ముదం
బున నిట్లనుఁ బూర్వజన్మమున నే దీనా
వనుఁడైన యీశ్వరుని చే
తను నిక్క మనుగ్రహింపఁ దగితి మునీంద్రా! [4-633]

క. వినుఁ డట్టి యనుగ్రహ సా
ధనమునకై మీర లిపుడు దగ నిచ్చటికిం
జనుదెంచితిరి దయాళురు
నసఘులు భాగవతవరులు నగు నుత్తములున్. [4-634]

ఇంత చెప్పాక పృథు చక్రవర్తి అంటున్నాడు – ఏదో జన్మలో నేను చేసుకున్న పుణ్యం కాబోలు, మీరు ఇచ్చిన దీక్ష నాకు లభించింది. అలా అనుగ్రహం లభించడం వల్లే మీరు ఇక్కడకి వచ్చి నాకు దీక్ష ఇచ్చారు.

ఇక్కడవరకూ వచ్చాక ఓ మాట చెప్పుకోవాలి. గురు దీక్ష అనేది అంత సులభంగా దొరికేది కాదు. దొరికినా మనం అభ్యాసం చేయలేం. చేసినా మనకి సాధన, ధ్యానం, ధారణ ఏదీ కుదరకపోవచ్చు. ఏదో విధంగా ఇవన్నీ కుదిరినా మనకి సమాధి అనేది కాంతి సంవత్సరాలంత దూరంగానే ఉంటుంది. దీనిక్కారణం మనమే, మనం చేసుకున్న,

చేస్తున్న కర్మలు మాత్రమే. ఇలా సంసారంలో కూరుకు పోతూన్న మనకి విముక్తి లభించాలంటే ఎలా? ఈ విషయం మనం భగవద్గీతలో చూడవచ్చు.

మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే ।
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః (భగవద్గీత, జ్ఞాన విజ్ఞాన యోగం 7-3)

వేల మందిలో ఒకరు అత్మ జ్ఞానానికి ప్రయత్నం చేస్తారు. అలా చేసినవాళ్లలో ఒక్కడు మాత్రమే భగవంతుణ్ణి తెల్సుకోగల్గుతున్నాడు. అంత కష్టం కనకే భగవంతుడి కృపలేకుండా ఆత్మ జ్ఞానం అసంభవం. అది రావాలంటే గురు దీక్ష, ధ్యానం అన్నీ కలిసిరావాలి. అంతటి కృప చూపించిన గురువుకి మనం ఇచ్చే గురుదక్షిణ లాంటిదేమీ కనిపించదు. అందుకే ముందు ఎన్నో సార్లూ ఈ వ్యాసపరంపరలో చెప్పుకున్నట్టూ భగవంతుడికి మనం ఇవ్వగలిగేది మన మనస్సు ఒకటే – భవతు భవదర్థం మమ మనః. అందుకే పృథు చక్రవర్తి అంటున్నాడు నాకెన్నో జన్మల పుణ్య ఫలం వల్ల ఇలా మీరు వచ్చి దీక్ష ఇచ్చారు అని. అలా పృథు చక్రవర్తికి దీక్ష ఇచ్చి అంతర్ధానమై పోయారు సనకసనందనాదులు.

వచ్చే వ్యాసంలో మిగతా కథ, పృథువు తర్వాత ఏమౌతుందనేది తెలుస్తుంది.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS